సస్యరక్షణతో అధిక దిగుబడులు

- మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మెరుగైన ఫలితాలు
- రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు
- మెట్టలో 17818 ఎకరాల్లో సాగు



తుని మండలం మరువాడలో సాగు చేస్తున్న మామిడి తోటలు

తుని రూరల్: మామిడి సాగు చేసే రైతులు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చు. వేసవి మధుర ఫలాల్లో ఒకటైన మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలకు ఇదే సరైన సమయమని ఉద్యాన అధికారులు పేర్కొన్నారు.మామిడిలో ఇప్పుడిప్పుడే పూత ప్రారంభమయ్యే దశ నుంచి పండ్లు చేతికి అందే వరకూ సస్యరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. ఇప్పటికే దుక్కులు పూర్తి చేసిన సాగుదారులు సకాలంలో పూత రావడానికి, పూత నిలవడానికి, పిందెలు నిలిచి కాయలు పక్వానికి వచ్చే వరకు తెగుళ్లు, పురుగులు సోకకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీరు, క్రిమికీటకాల నివారణ, పురుగుల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉంది. పూమొగ్గ దశ, పచ్చి పూత దశ, నల్ల పూత దశ (పిందె కట్టు దశ) వరకూ చేపట్టాల్సి చర్యలను తుని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి వివరించారు.

మెట్టలో సాగు ఇలా..

మెట్ట ప్రాంతమైన తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి, గోకవరం మండలాల పరిధిలో 17818 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. ఇందులో తుని నియోజకవర్గంలో 6872 ఎకరాలు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 4736 ఎకరాలు, జగ్గంపేట నియోజకవర్గంలో 6210 ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

వివిధ దశల్లో సస్యరక్షణ చర్యలు

పూమొగ్గ దశ:

తేనె మంచు పురుగులు, మొగ్గ తొలుచు పురుగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు, మసి తెగులు సోకుతాయి.

నివారణ : క్లోరిఫైరీపాస్ 50 ఈసీ లేదా లామ్డాసైహలోత్రిన్ లేదా స్పైనోటోరం ఒక మిల్లీ లీటరు, క్లోరోథలోనిల్ రెండు మిల్లీ లీటర్లు, లేదా నల్ల గంధం మూడు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పచ్చిపూత దశ : తేనెమంచు పురుగు, బూడిద తెగులు, మొగ్గ తొలుచు పురుగులు పంటను ఆశిస్తాయి.

నివారణ : ప్రొఫినోఫాస్ 50 ఈసీ రెండు మిల్లీ లీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.80 శాతం ఈసీ రెండు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి కొమ్మలు బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.

నల్ల పూత దశ: తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు సోకే అవకాశం ఉంది.

నివారణ : హెక్సకానోజోల్ రెండు మిల్లీ లీటర్లు లేదా అజాక్సీరోబిన్ ఒక మిల్లీ లీటరు, టేబ్యు కొనిజోల్ 18.3 శాతం ఒక గ్రాము, ప్లానిఫిక్స్ 0.2 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పూత దశను దాటుకుని పిందె కట్టు దశకు చేరుకుంటుందని తెలిపారు.

అధిక మోతాదులో పురుగు మందులు వాడొద్దు



మామిడి సాగు చేసే రైతులు ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలను పాటించాలి. అధిక మోతాదులో పురుగులు మందులు, ఎరువులు వినియోగించడం వల్ల పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. అలాగే పురుగు మందుల అవశేషాలు మామిడి పండ్లలో చొచ్చుకుపోతాయి. దీనివల్ల మామిడి పండ్లు తినే వ్యక్తుల శరీరంలోకి హానికరమైన అవశేషాలు చేరి ప్రమాదకరంగా మారుతాయి. దేశ విదేశాలకు ఎగుమతే లక్ష్యంగా నాణ్యత గల అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాలి. రంగు నాణ్యత బాగుంటే మంచి గిట్టుబాటు ధర పొందవచ్చు.

– జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని

త్వరలో చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు



దివ్యాంగులతో కలిసి భోజనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు

అన్నవరం: త్వరలో ముదునూరి మురళీకృష్ణంరాజు చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రత్తిపాడు నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు తెలిపారు. అన్నవరం గ్రామ శివారులోని శాంతివర్ధన మానసిక వికలాంగుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్తిక వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో అన్నవరం వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, ఎంపీటీసీ దడాల సతీష్, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, తాటిపాక కృష్ణ, రాయుడు రాజు, ఈగల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికులకు న్యాయం చేయాలి



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఏలేశ్వరం: జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు కోరారు. చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం ఆందోళన చేశారు. కార్మికులు ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు యాజమాన్యం న్యాయం చేయాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నేరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



సంజు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాగచైతన్య అభిమానులు

ఏలేశ్వరం: సినీ హీరో అక్కినేని నాగచైతన్య జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణ పరిధిలోని అప్పన్నపాలేనికి చెందిన క్యాన్సర్ బాధితుడికి శుక్రవారం ఆయన అభిమానులు ఆర్థిక సాయం అందజేశారు. అప్పన్నపాలేనికి చెందిన గంట సత్యనారాయణ కుమారుడు సంజు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సి.రాయవరం వాసులు, శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నేమాల శ్రీనివాసరావు కలిపి రూ.50 వేలు సంజుకు అందజేశారు. కార్యక్రమంలో నాగచైతన్య అభిమానులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: తుని, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజరు కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రజలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్యలో 73829 21904 నంబరుకు ఫోన్‌చేసి తమ సమస్యలు, సలహాలను తెలియజేయాలని కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

గండేపల్లి: పింఛను లబ్ధిదారులకు డిసెంబర్ నెలకు సబంధించిన పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారమే లబ్ధిదారులకు పింఛన్లు అందజేయనున్నట్టు చెప్పారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తుని: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన వేళ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తుని టౌన్ సీఐ గీతా రామకృష్ణ సూచించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో శుక్రవారం తుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ అరెస్ట్, కేవైసీ, జాబ్స్, స్టాక్ మార్కెట్ తదితర మోసాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎస్సై విజయ్‌బాబు, ప్రిన్సిపాల్ విజయకుమారి, లెక్చరర్లు గోవింద్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి

తుని: అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని యాప్‌మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మిరెడ్డి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ పరిధిలోని ఉప్పరగూడెం, కొత్తపేట-1 అంగన్ వాడీ కేంద్రాలకు శుక్రవారం ఎస్‌బీఐ సౌజన్యంతో సమకూర్చిన 14 రకాల ప్లే మెటీరియల్‌ను ఆమె పంపిణీ చేశారు. ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులకు ప్లే మెటీరియల్ ఆవశ్యకత, అవసరాన్ని వివరించారు. పిల్లలను రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఐసీడీఎస్ సీడీపీఓ నిహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: శంఖవరం మండలం పెదమల్లాపురం గిరిజన తండాలో సారా స్థావరాలపై శుక్రవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నిందితులు పరారయ్యారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

తొండంగి: మండలంలోని అన్నయ్యపేటలో సారా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 2600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తుని ఎక్సైజ్ సీఐ పట్టాభిచౌదరి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ముద్రగడ వెంటే మా ప్రయాణం



కిర్లంపూడిలో ముద్రగడ, గిరిబాబులను కలసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం వెంటే మా ప్రయాణం అని ఏలేశ్వరం నగర పంచాయతీ 15వ వార్డు మాజీ కౌన్సిలర్ సుంకర రాంబాబు అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలానికి చెందిన పలు గ్రామాల సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి బైకులపై ర్యాలీగా తరలివచ్చారు. ముద్రగడతో పాటు, యువ నాయకుడు గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై ముద్రగడ ఆరా తీశారు. ఆయనను కలిసిన వారిలో కోరడ రాజు, ఎస్.రాజేష్, తాళ్లపూడి వీరబాబు, పేకేటి ప్రకాశం, కొత్తపల్లి రవి, రెడ్డి బాబు, అల్లం అదినారాయణ, తిబిరిశెట్టి తాతాజీ, అచ్చే సీతారాం, మక్కా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

గండేపల్లి: మండలంలోని బొర్రంపాలెంలో రైతులకు శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి పి.లావణ్య మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు ఆవశ్యకత, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం ఏఎస్ ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోకల సుబ్బు, మాజీ సర్పంచ్ పల్లపు విష్ణుచక్రం, కంపెనీ సిబ్బంది వీర్రాజు, దుర్గా ప్రసాద్, గణేశ్వరరావు, మణి కుమార్, ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం చూపాలి

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యకు అధికారులు పరిష్కారం చూపాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2 నాటికి జిల్లా కలెక్టర్ నియమించిన నిజనిర్ధారణ కమిటీ నివేదికను బహిరంగపరచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే మరుసటి రోజు నుంచి ఫ్యాక్టరీ సమీపంలో నల్లజెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

6న మండల పరిషత్ సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిసెంబర్ 6న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.గోవిందు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఫెంగల్ తుపాను ప్రభావంతో చిరు జల్లులు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలోని మెట్ట, తీర ప్రాంతాల్లో శుక్రవారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి వాతావరణంపూర్తిగా మాగుడుగా ఉండటంతో పాటు ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం తొండంగి, బెండపూడి, కోదాడ, రావికంపాడు, తీరప్రాంత గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి. పలు ప్రాంతాల్లో ఖరీఫ్ పంట పనలపై ఉండటంతో వర్షానికి తడిసింది. తుపాను ముప్పు తప్పే వరకూ రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని ఏఓ ఎస్.నరసింహం తెలిపారు. పనలపై ఉన్న పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షానికి పంట తడిస్తే ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. కాగా తుపాను కారణంగా శుక్రవారం రాత్రి ఈదురు గాలుల తీవ్రత మరింత పెరిగింది. వరితో పాటు అరటి, జీడిమామిడి, మామిడి రైతులు ఈదుర గాలల ప్రభావానికి పంట నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.

నేడు రంగం యువజనోత్సవాల ముగింపు వేడుకలు

తుని: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంగం యువజనోత్సవాల ముగింపు వేడుకలను పాయకరావుపేట సాయిఉత్సవ్ ఫంక్షన్ హాలులో శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్టు రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు మంగరాజు శుక్రవారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 14 విభాగాల్లో విజయం సాధించిన 500 మందికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని వివరించారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు

గండేపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయింత్రం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల దర్యాప్తులో పురోగతి, సైబర్ నేరాల నివారణపై విస్తృతంగా అవగాహన సదస్సులు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివనాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ప్రత్తిపాడులో బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రత్తిపాడు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మినర్వా విద్యాసంస్థల ఆవరణలో శుక్రవారం బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో ఆడపిల్లలకు పెళ్లి చేస్తే తల్లితో పాటు పుట్టే బిడ్డకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులకు తగిన వయస్సు వచ్చిన తర్వాత వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. అనంతరం ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి వి.రాజబాబు, ఏపీఎం వై.వెంకట్, ప్రిన్సిపాల్స్ హరిబాబు, ఆనంద కుమార్ జోషి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: బాల్య వివాహాలు చట్ట రీత్యానేరమని ఐసీడీఎస్ జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాదయాత్ర



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు ప్రసాదాచార్యులు

గండేపల్లి: సనాతన ధర్మ పరిరక్షణ, గో సంరక్షణ కోసం వచ్చే నెలలో పాదయాత్ర నిర్వహించనున్నట్టు భారతీయ ధర్మ పరిషత్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తాళ్లూరు మఠాధిపతి పాడుగు ప్రసాదాచార్యులు తెలిపారు. మండలంలోని తాళ్లూరు మఠంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భారతీయ ధర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ శరణానంద భారతీ స్వామి ఆదేశాల మేరకు పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించామన్నారు. డిసెంబర్ 9న జగ్గంపేట సోమాలమ్మ ఆలయం వద్ద నుంచి కొంగల రావిచెట్టు వరకూ పాదయాత్ర చేస్తామన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో కృష్ణ శరణానంద భారతీస్వామి, విస్మయ నందగిరి స్వామి, సత్యానంద గిరిస్వామి తదితరులు ఆధ్యాత్మిక చేస్తారని, భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర, రెడ్డి సాయి, కురుమళ్ల శ్రీను, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తునిలో 40 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

తుని: స్థానిక రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1983, 1985 బ్యాచ్‌ల విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పెంటకోట రోడ్డులోని గెద్దమూరి వారి తోటలో సుమారు 40 ఏళ్ల తరువాత ఒకేచోట కలుసుకున్నారు. వ్యాపార, ఉద్యోగ వృత్తుల్లో స్థిరపడిన సుమారు 100 కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆట పాటలతో సందడి చేశారు. కార్తిక మాసంలో బాల్యమిత్రులు కలుసుకోవడం ఆనందాన్ని ఇచ్చిందని పూర్తి విద్యార్థి, తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు అన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నరసింహారావు



తునిలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ ఆర్‌డీ నరసింహారావు

తుని: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నరసింహారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం తుని పురపాలకసంఘంలో పలు ప్రాంతాలను ఆకస్మికంగా పరిశీలించారు. కొండవారిపేట సచివాలయాన్ని విజిట్ చేసి ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇసుకలపేట డంపింగ్ యార్డును పరిశీలించారు. మురుగునీటి శుద్ధి చేసే ప్లాంటు ఏర్పాటుకు 3.50 ఎకరాల భూమిని సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఉప్పరగూడెం ప్రాంతంలోని 3.50 ఎకరాల భూమిని అధికారులు ఆయనకు చూపించారు. డంపింగ్ యార్డు స్థల సేకరణకు త్వరగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వెంకట్రావును ఆదేశించారు. వీరవరపుపేట పసువుల ఆసుపత్రిలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడానికి ఏర్పాటు చేసిన షెడ్లను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుని పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి రూ.6.50 కోట్లు బకాయిలు ఉన్నాయని, వీటి వసూళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సేవలతో పాటు ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

యనమల కృష్ణుడికి ముద్రగడ పరామర్శ



తునిలోని నివాసంలో యనమల కృష్ణుడిని పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం

తుని: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. ఇటీవల యనమల కృష్ణుడి భుజానికి గాయం కావడంతో ఇంటికే పరిమితం అయ్యారు. విషయం తెలుసుకున్న ముద్రగడ పద్మనాభం శుక్రవారం సాయంత్రం తునిలోని కృష్ణుడు నివాసానికి వెళ్లి పరామర్శించారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కిర్లంపూడిలో రుద్రాక్ష అలంకరణలో మట్టి శివలింగం



గోపాలపట్నంలో కల్యాణ అలంకరణలో స్వామి, అమ్మవార్లు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శివ పార్వతుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం ఉమారామలింగేశ్వరుడు, పార్వతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణవేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మహాఅన్నసమారాధన నిర్వహించారు. కాగా శనివారం రాత్రి ఏడుగంటలకు స్వామి, అమ్మవార్ల శ్రీపుష్ప యాగం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ తెలిపారు.

వైభవంగా లక్ష రుద్రాక్ష హోమం

కిర్లంపూడి: మాసశివరాత్రిని పురస్కరించుకుని కిర్లంపూడి దొరగారి గ్రౌండ్‌లో శుక్రవారం మట్టి శివలింగాన్ని తయారు చేసి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్థానిక పండితులు స్వామివారికి మహన్యాస పూర్వకరుద్రాభిషేకం, లక్షపత్రి, లక్షరుద్రాక్ష హోమం, జ్యోతిర్లింగార్చన, కుంకుమార్చన, రుద్రహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఐలాజ్ మహాసభను విజయవంతం చేయాలి

తుని: అన్నవరం శేషాద్రి సదన్‌లో డిసెంబర్ 8న జరిగే ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు. న్యాయవాదుల రక్షణ, సంక్షేమం తదితర అంశాలపై చర్చించే ఈ మహాసభకు న్యాయవాదులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సలుగు కృష్ణశేఖర్, కార్యదర్శి గణేష్, ప్రతినిధులు యనమల సత్యన్నారాయణ, సాకా సత్తిబాబు, ఎంతఃసూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

శృంగవృక్షంలో స్కూటీ చోరీ

తొండంగి: మండలంలోని శృంగవృక్షంలో స్కూటీ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన దివిలి పాపారావు గురువారం రాత్రి ఇంటి ఆవరణలో స్కూటీని పార్కింగ్ చేసి నిద్రించారు. తెల్లవారేసరికి పార్కింగ్ చేసిన స్కూటీ చోరీకి గురైంది. దీనిపై ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో మండలంలోని సీతారాంపురం, ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో కూడా బైకులు చోరీకి గురయ్యాయి. వరుస చోరీలతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధనలు

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం) వద్ద శుక్రవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ వనసమారాధన ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే గ్రామ శివారున బురదకాలువ సమీపంలో మామిడితోటలో నాయీబ్రాహ్మణుల సంక్షేమ సంఘం కార్తిక వనసమారాధన ఘనంగా జరిగింది. మండలంలోని నాయీబ్రాహ్మణులు కుటుంబ సమేతంగా పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మొత్తం 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.